క్లుప్తంగా

అనంతారం వాసికి డాక్టరేట్



వైస్ చాన్స్‌లర్ కిషన్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా పట్టా అందుకుంటున్న మహేందర్

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన బొడ్డుపల్లి మహేందర్‌కు జేఎన్‌టీయూ హైదరాబాద్ వారు పీహెచ్‌డీ పట్టా అందజేశారు. బుధవారం పీహెచ్‌డీ గ్రహీత మహేందర్ మాట్లాడారు. మంగళవారం నిర్వహించిన 13వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ, వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కిషన్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టాను పొందించినట్లు ఆయన తెలిపారు. యూనివర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్‌లో డాక్టర్ శోభారాణి ఆధ్వర్యంలో ఫార్మా కాలేజీ విభాగంలో ఎవాల్యుయేషన్ ఆఫ్ హెపటో ప్రొటెక్టివ్ యాక్టివిటీ ఆఫ్ ఎక్స్‌ప్లోర్డ్ ఇండియన్ మెడిసినల్ ప్లాంట్స్ ఇన్ డ్రగ్స్ ఎండ్ ఆల్కాహాల్ ఇండ్యూస్డ్ ఏనిమల్ మోడల్స్ అనే పరిశోధన గ్రంథాన్ని సమర్పించడంతో పీహెచ్‌డీ పట్టా పొందినట్లు తెలిపారు.

ఏడీఏగా రమేష్‌బాబు బాధ్యతల స్వీకరణ



రమేష్‌బాబు

తుంగతుర్తి : మండల నూతన ఏడీఏగా ఎల్.రమేష్‌బాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జ్ ఏడీఏగా బాలకృష్ణ పనిచేశారు. గద్వాల్‌లో ఏడీఏగా పనిచేస్తున్న ఎల్.రమేష్‌బాబు బదిలీపై మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులందరికీ సకాలంలో ఎరువులు, విత్తనాలు అందేలా చూస్తానని అన్నారు. కల్తీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అల్పాహారం పంపిణీ



అల్పాహారం పంపిణీ చేస్తున్న ముత్యంరాజు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : అయ్యప్పస్వామి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకొని అఖిల భారత అయ్యప్ప ధర్మప్రచార సభ జిల్లా అధ్యక్షుడు రంగు ముత్యంరాజు స్వాతి దంపతులు బుధవారం పట్టణంలోని వివిధ కూడళ్లలో, దేవాలయం వద్ద ఉండే అభాగ్యులకు, నిరాశ్రయులకు అల్పాహారం, వాటర్ బాటిల్, బిస్కెట్‌లు పంపిణీ చేశారు. అనంతరం రంగు ముత్యంరాజు మాట్లాడారు. వర్షాలు సమృద్ధిగా పడి పాడిపంటలు బాగా పండాలని ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ నిరాశ్రాయులకు అల్పాహారం పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో రంగు సాయిప్రీతి, తదితరులు ఉన్నారు.

ర్యాలీని విజయవంతం చేయాలి

సూర్యాపేట : అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు గ్రీన్ క్లబ్ ట్రస్ట్ అధ్యక్షుడు ముప్పారపు నరేందర్, కార్యదర్శి తోట కిరణ్, పీఆర్‌ఓ గండూరి కృపాకర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ తిరస్కరించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం కోసం ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీలో విద్యార్థులు పట్టణవాసులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

హోటల్‌లో కాంగ్రెస్ కార్యకర్త హల్‌చల్

చివ్వెంల : మండల పరిధిలోని అక్కలదేవిగూడెం గ్రామశివారులో గల ఓ హోటల్‌లో స్థానిక కాంగ్రెస్ కార్యకర్త హల్‌చల్ చేశాడు. ఈ సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు హోటల్‌లోని సీసీ కెమెరాలో రికార్డు కావడంతో ప్రస్తుతం ఆ వీడియో సోషల్ మీడియాలో పోస్టు కావడంతో వైరల్‌గా మారింది. మండల కేంద్రానికి చెందిన రామన్న సూర్యాపేట-ఖమ్మం రహదారి వెంట అక్కలదేవిగూడెం గ్రామ శివారులో దాబా నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 31న అక్కలదేవిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త హోటల్‌కు ఓ వ్యక్తిని పంపించి నాలుగు బిర్యానీలు తీసుకురమ్మన్నాడు. బిర్యానీలు పార్సిల్ చేసిన అనంతరం హోటల్ నిర్వాహకుడు డబ్బులు అడగడంతో తనను గ్రామానికి చెందిన వ్యక్తి పంపించాడని, అతడే ఇస్తాడని తెలపడంతో డబ్బులు ఇస్తేనే పార్సిల్ ఇస్తామని హోటల్ నిర్వాహకుడు చెప్పాడు. ఈ విషయాన్ని వచ్చిన వ్యక్తి కాంగ్రెస్ కార్యకర్తకు ఫోన్ చేసి చెప్పడంతో అతడు హోటల్ వద్దకు వచ్చి నానా హంగామా చేశాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. దీనికి తోడు హోటల్‌లో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు స్థానికుల పేర్కొన్నారు. దీంతో నిర్వాహకుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్ఐ మహేశ్వర్‌ను వివరణ కోరగా.. హోటల్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కాంగ్రెస్ కార్యకర్తతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుంతలరోడ్డుకు మరమ్మతులెప్పుడో..

- అధ్వానంగా అర్వపల్లి-కొమ్మాల రోడ్డు
- అడుగడుగునా గుంతలతో రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు



బీటీ దెబ్బతిని అధ్వానంగా మారిన అర్వపల్లి-కొమ్మాల రహదారి



కాసర్లపహాడ్-కొమ్మాల మధ్య ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

అర్వపల్లి : మూడు మండలాల ప్రజలు రాకపోకలు సాగించే అర్వపల్లి-కొమ్మాల రహదారి గుంతలమయంగా మారి అధ్వానంగా ఉంది. బీటీరోడ్డు నిర్మాణం చేపట్టి ఏళ్లుగడుస్తున్నా ఎలాంటి మరమ్మతులకు నోచుకోక ఈ రహదారిపై బీటీ లేచిపోయి భారీ గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. నిత్యం జాజిరెడ్డిగూడెం, తుంగతుర్తి, నూతనకల్ మండలాల ప్రజలు ఈ రహదారి నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఆయా మండలాలకు రెండు జాతీయ రహదారులపై ఉన్న అర్వపల్లికి రావడానికి ఇది దగ్గరి ప్రధాన దారి కావడంతో ఈ రోడ్డు ఎక్కువ రద్దీగా ఉంటుంది.

9కిలోమీటర్లు గుంతలమయంగా..

అర్వపల్లి నుంచి కొమ్మాలకు 9కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ రహదారి మొత్తం బీటీ లేచి పూర్తిగా గుంతలమయంగా మారింది. అలాగే ఈ రహదారిపై 15కు పైగానే మూలమలుపులు ఉన్నాయి. ఈ మలుపుల వద్ద కంపచెట్లు భారీగా పెరిగి మూలమలుపులు కనిపించని పరిస్థితి నెలకొంది. ఈ రహదారిలోని మూలమలుపుల వద్ద ఎలాంటి ప్రమాద సూచికబోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రహదారిలో బీటీ రెన్యువల్ చేసి మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరుగకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహన చోదకులు, ప్రజలు కోరుతున్నారు.

బీటీ రెన్యువల్ చేయాలి



అర్వపల్లి-కొమ్మాల రహదారి పూర్తిగా అధ్వానంగా ఉంది. ఈ దారిని బీటీ రెన్యువల్ చేసి ప్రమాదాలు జరుగకుండా చూడాలి. ఈ రోడ్డు ప్రయాణం సాగించాలంటే నానా అవస్థలు పడాల్సివస్తుంది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

– బౌరోజు ఉపేందర్, కొమ్మాల

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



అర్వపల్లి నుంచి కాసర్లపహాడ్ మీదుగా కొమ్మాల వెళ్లే దారి పూర్తిగా గుంతలమయంగా మారి ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ దారిని మరమ్మతు చేయించాలని ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నాం. ఇప్పటికైనా బాగుచేయించి ప్రజల ఇబ్బందులు తీర్చాలి.

– మచ్చ నర్సయ్య, కాసర్లపహాడ్

సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం



చెక్కులు అందజేస్తున్న సర్వోత్తమ్‌రెడ్డి

సూర్యాపేట : సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరంలాంటిదని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన బాధితులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. వైద్యం పరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నామన్నారు. మొత్తం రూ.15లక్షల 9500 విలువ చేసే 38చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్ ధరావత్ వీరన్ననాయక్, చింతమల్ల రమేష్, తెలంగాణ మహిళా ఉపాధ్యక్షురాలు వేములకొండ పద్మ, దివ్య, మందాడి శేఖర్, నాగుల వాసు, మద్దెబోయిన శ్రీనివాస్, తంగెళ్ల కర్ణాకర్‌రెడ్డి, సిరివెళ్ల శబరినాథ్, అనంతుల యాదగిరి, మాద నవీన్, పందిరి మల్లేష్, రమేష్, శిరీష శేఖర్, పాపయ్య, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ బాలల సంరక్షణ దినోత్సవం



బాలల సంరక్షణ దినోత్సవంలో పాల్గొన్న చిన్నారులు

సూర్యాపేట : సూర్యాపేట పూర్వ విద్యార్థి మిత్ర మండలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల సంరక్షణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం ప్రధాన కార్యదర్శి బయ్యా మల్లికార్జున్ మాట్లాడారు. నేటి బాలలే రేపటి భావిభారత పౌరులు అని అన్నారు. బాలల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సట్టు వెంకన్న, తన్నీరు యాదగిరి, వీరబోయిన భగవాన్, కన్నా యాదవ్, వీరబొయిన ధృవకాంత్‌యాదవ్, వేల్పుల విజయ్, కేతావత్ సన్నీ, విక్రమ్, హేమంత్, రిషీ, లక్కీ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

సూర్యాపేట అర్బన్ : ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. 100రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం 3వ రోజు పట్టణంలోని 3వ వార్డు బీబిగూడెంలో నిర్వహించి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గృహ, వాణిజ్య, వ్యాపార సంస్థల వారు తమ ఇండ్లలోని చెత్తను తడి, పొడి, హానికరమైన చెత్తను వేరుచేసి ఇవ్వాలన్నారు. వీధుల్లో సంచరించే కుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలని, పెంపుడు కుక్కల మెడకు బెల్ట్‌లు, టీకాలు వేయించాలని సూచించారు. చిరు వ్యాపారాలు చేసుకొనే వారికీ గుర్తించి స్ట్రీట్ వెండర్ సంఘాలు చేయడాకు ప్రతిపాదనలు తీసుకున్నామని, వ్యాపార సంస్థలను గుర్తించి ట్రేడ్ లైసెన్స్ వసూలు చేయడంతో పాటు శిథిలావస్థలో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న భవనాల వారికీ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ డీఈ సత్యారావు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఏఈ తిరుమలయ్య, యాదగిరి, టీఎంసీ శ్వేత, వార్డ్ అధికారి ఎడ్ల వినోద్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, వసీం తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



కరపత్రాలు విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

సూర్యాపేట : పట్టణంలోని శ్రీసంతోషిమాత ఆలయ 30వ వార్షికోత్సవాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ప్రధాన కార్యదర్శి బ్రాహ్మండ్లపల్లి మురళీధర్ బుధువారం తెలిపారు. ఈ సందర్భంగా వార్షికోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆయన ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులతో కలిసి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. శ్రీ సంతోషిమాత అమ్మవారిని జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థానం పీఠాధిపతులు శ్రీ అభినవొద్దండ నృసింహ భారతి మహాస్వామి కరకమలములచే ప్రతిష్ఠించుకొని 30 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఉపాధ్యక్షుడు నరేంద్రుని విద్యాసాగర్ రావు, ఉప కోశాధికారి కొత్త మల్లికార్జున్, అన్నదాన నిర్వాహకులు దేవరశెట్టి సోమయ్య, కమిటీ సభ్యులు గోపారపు రాజు, మహంకాళి ఉపేందర్, దేవాలయ అర్చకులు బట్టారం వంశీకృష్ణశర్మ, బచ్చు పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ బాలుకు ఘన నివాళులు



ఎస్పీ బాలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సభ్యులు

సూర్యాపేట : పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా బాల్‌భవన్, జ్ఞాన సరస్వతి కళావేదిక బుర్రి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గాన గంధర్వుడు ఎస్పీ బాలు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్ భవన్ అభివృద్ధి కమిటీ సభ్యులు, రిటైర్డ్ అధ్యాపకుడు, కవి హమీద్ ఖాన్ హాజరై మాట్లాడారు. చెవిలో అమృతం పోసినట్టు ఉండే ఆయన స్వరం అజరామరం, వారు పలు భాషల్లో పాడారని, కొందరు యువ నటులకు ఆయన పాట స్వరంతో గుర్తింపు వచ్చిన సందర్భాలు ఉన్నాయన్నారు. తెలుగు భాషకు, తెలుగు పాటకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వారి గానంతో వచ్చిందని, అదొక స్వర్ణ యుగమని ఎస్పీని కొనియాడారు. కార్యక్రమంలో బాల్‌భవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణరెడ్డి, బుర్రి క్రాంతికుమార్, మౌనిక, బాలభవన్ సిబ్బంది దాసరి ఎల్లయ్య, ఉమ, సత్యనారాయణ సింగ్, అనిల్, సాయి, వీరు, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నర్సింహారావు

నూతనకల్ : ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని తుంగతుర్తి సీఐ నర్సింహారావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని తాళ్లసింగారం గ్రామంలో నిర్వహించిన పోలీసు ప్రజాభరోసా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చట్టాల అమలు, జైలు శిక్షలు, వ్యక్తుల సత్ప్రవర్తన పలు అంశాలతో పాటు క్షణికావేశం, స్వార్థంతో నేరాలకు పాల్పడవద్దని ఆయన తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పోలీసు శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తుందన్నారు. సైబర్ నేరాలు, మహిళల పట్ల జరుగుతున్న దాడులు, పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ గోపాల్‌రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

చివ్వెంల : మండల పరిధిలోని కుడకుడ గ్రామ శివారులో కాంగ్రెస్ జిల్లా కార్యాలయ నూతన భవన నిర్మాణానికి బుధవారం ఆ పార్టీ నాయకులు స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ చింతమళ్ల రమేష్, నాయకులు ఉన్నారు.

కాల్వ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

నూతనకల్ : మండలంలోని గుండ్లసింగారం శివారులోని ఏపూరు ఆనకట్ట ఎడమగట్టు కాల్వను ఆక్రమించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు దాసరి వెంకన్న, బాణాల వెంకట్‌రెడ్డి కోరారు. బుధవారం స్థానికంగా వారు విలేకరులతో మాట్లాడారు. గ్రామ శివారులోని 291లో ఇద్దరు రైతులకు చెందిన 4.30ఎకరాల భూమికి ఏపూరు ఆనకట్టకు చెందిన కాల్వగట్టే ప్రధాన దారి అని, ఈ దారిని ఆక్రమిస్తే మేము కోరిన ధరలకు భూములు అమ్ముతామనే ఉద్దేశంతో రైతు ఉయ్యాల శ్రీనివాస్ కాల్వగట్టును పూర్తిగా చెడగొట్టి తన భూమిలో కలుపుకున్నారని, దీంతో ఇరువురు రైతులకు దారి లేని పరిస్థితి ఏర్పడిందని వారు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాల్వ గట్టును పునఃరుద్ధరించాలని కోరారు.

క్షయరహిత సమాజానికి కృషి

అర్వపల్లి : క్షయరహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ భూక్యా నగేష్‌నాయక్ కోరారు. మండలంలోని కుమ్మరిగూడెం గ్రామంలో మంగళవారం క్షయవ్యాధి నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 24మందికి పరీక్షలు చేపట్టి ఆయన మాట్లాడారు. టీబీని సకాలంలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చన్నారు. క్షయవ్యాధి నివారణ రోగుల చేతుల్లోనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీబీ మండల నోడల్‌పర్సన్ కుంభం వీరయ్య, ల్యాబ్ టెక్నీషియన్ చొక్కయ్య, ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి, ఆశా కార్యకర్త, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- ఎమ్మెల్యే మందుల సామేల్



అర్వపల్లి : కుంచమర్తిలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్

అర్వపల్లి : భూ సమస్యల పరిష్కారానికై ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని కుంచమర్తి గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్వహించిన ధరణిలో అనేక అక్రమాలు జరిగాయని, అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలతో పాటు గతంలో జరిగిన తప్పులను సరిదిద్దడానికే సీఎం రేవంత్‌రెడ్డి భూభారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని యూపీఎస్ ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఆయా గ్రామాల్లో రైతుల నుంచి 35 దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు సామ అభిషేక్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ భాషపాక శ్రీకాంత్, ఎంపీడీఓ గోపి, ఎల్సోజు నరేష్, ఏఎంసీ డైరెక్టర్లు సైదులు, జలేందర్, మాజీ జెడ్పీటీసీ కె.అవిలయ్య, నాయబ్ తహసీల్దార్ చిప్పలపల్లి యాదగిరి, ఆర్ఐ ఆర్.జలేందర్ రావు, పాటి వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిరాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ భారతి పథకంతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆర్డీఓ వేణుమాధవ్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని రామచంద్రపురం, మామిండ్లమడవ గ్రామంలో ఏర్పాటు చేసిన సదస్సును ఆయన అకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ కంఠమయ్య, సీనియర్ అసిస్టెంట్ రామరావు, ఆర్ఐలు వహీద్, సిబ్బంది తరుణ్, ఉపేందర్, కార్తిక్, కార్యదర్శులు ఉమ, ఉమారాణి, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

నూతనకల్ : భూ భారతి సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిల్పకుంట్ల, గుండ్లసింగారం గ్రామాల్లో నిర్వహించిన సదస్సులోఆయన పాల్గొని మాట్లాడారు. రెండు గ్రామాల్లో 130దరఖాస్తులు స్వీకరించామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు భూసమస్యలు పరిష్కరించుకోవాలి

చివ్వెంల : రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ప్రకాశ్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని తిమ్మాపురం, తుల్జారావుపేట గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూ సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతుల వద్ద నుంచి 58దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. సదస్సులో ఆర్‌ఐలు శ్రీనివాస్, శ్రావణి పాల్గొన్నారు.

తిరుమలగిరి : భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ హరిప్రసాద్ కోరారు. బుధవారం మండలంలోని వెలిశాల, గుండెపూరి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో 90 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జాన్‌మహ్మద్, జార్జిరెడ్డి, సుజిత్‌రెడ్డి, కార్యదర్శి కిరణ్, పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ లాలు అన్నారు. బుధవారం మండల పరిధిలోని లింగాల, అనాజీపురం గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లింగాల గ్రామంలో 76, అనాజీపురంలో 70 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు రంజిత్‌రెడ్డి, అజీజాబేగం, సీనియర్ అసిస్టెంట్ రాధా, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మద్దిరాల : మామిండ్లమడవలో మాట్లాడుతున్న ఆర్డీఓ వేణుమాధవ్‌రావు

తుంగతుర్తి : గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని ఆర్డీఓ వేణుమాధవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కరివిరాల కొత్తగూడెం, మానాపురం, ఏనేకుంటతండాలో జరిగిన భూభారతి రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కర్విరాల నుంచి 46, మానాపురం నుంచి 121దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ దయానందం తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాగారం : రైతులు భూభారతి రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ హరికిషోర్‌శర్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో రెండో రోజు రెవెన్యూ సదస్సు నిర్వహించి మాట్లాడారు. సదస్సులో రైతుల నుంచి 51 దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ షాహిన్‌బేగం, ఆర్ఐ అల్లావుద్దీన్, ఎంపీఎస్‌ఓ చింతమల్ల రమేష్, సీనియర్ అసిస్టెంట్ షఫీ, సర్వేయర్ సాయిక్రిష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న ఏఓ కృష్ణకాంత్, ఉద్యానశాఖ అధికారులు

నాగారం : నీటివసతి ఉన్న రైతులు ఆయిల్‌పామ్ తోటలను సాగు చేసి అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి కృష్ణకాంత్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగారంబంగ్లాలో నూతనంగా ఆయిల్‌పామ్ పంట సాగు చేస్తున్న రైతు కత్తుల వెంకన్న వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న దీర్ఘకాల పంటలైన ఆయిల్‌పామ్ తోటలను సాగుచేస్తే రైతులు నెలనెలా ఆదాయం పొందవచ్చన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం బిందు సేద్యం, ఎరువులకు, అంతర పంటలకు రాయితీలు ఇస్తుందన్నారు. ఆయిల్‌పామ్ తోటలు సాగు చేయాలనుకున్న రైతులు ఉద్యాన శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓలు శ్వేత, శ్రీనివాస్, పతంజలి ఆయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్ అశోక్, క్షేత్ర సహాయకులు రంగు ముత్యంరాజు, రైతులు వడ్డే పరుశరాములు, రాపోలు సురేష్, కుమార్‌స్వామి, నరేష్, మోహన్‌రెడ్డి, సోమిరెడ్డి పాల్గొన్నారు.

రైతులను మోసగిస్తున్న కంపెనీలు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నాగారం : రైతులకు కల్తీ ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు అమ్మి మోసం చేస్తున్న కంపెనీలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కల్తీ ఎరువులు, విత్తనాలు అరికట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, మందులను ప్రభుత్వమే గ్రామ పంచాయతీల ద్వారా అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు బయ్యు లింగయ్య, జాజుల సామేలు, ఉప్పలయ్య, ధనుంజయ్, సమ్మద్, వెంకన్న, రాజేష్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని తరిమికొట్టడంలో ముఖ్యపాత్ర



జెండావిష్కరణలో పాల్గొన్న మహిళలు

సూర్యాపేట అర్బన్ : భారతదేశం నుంచి బ్రిటీష్ సామ్రాజవాదాన్ని తరిమికొట్టడంలో మహిళా సమాఖ్య పాత్ర మరువలేనిదని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన అన్నారు. బుధవారం భారత మహిళా సమాఖ్య 71వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆమె జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షురాలు మల్లేశ్వరి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కోటమ్మ, దేవర మల్లేశ్వరి, సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు దేశగాని హేమలత, పాదిలి వెంకటమ్మ, పద్మ, రేఖ పాల్గొన్నారు.

పోలీస్‌శాఖలో సేవలు అందించడం అభినందనీయం

సూర్యాపేటటౌన్ : కోదాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న అబ్దుల్ సత్తార్ బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ జిల్లా కార్యాలయంలో ఎస్పీ కె.నరసింహ హోంగార్డు సత్తార్‌ను సన్మానించారు. అనంతరం ఎస్పీ మాట్లాడారు. హోంగార్డుగా సుదీర్ఘకాలం సేవలు అందించడం అభినందనీయమన్నారు. పోలీసు డిపార్ట్‌మెంట్‌లో 30సంవత్సరాల పాటు సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. ఈ ఉద్యోగ విరమణ అనంతరం ప్రజాసేవలో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరసింహాచారి, సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట : కస్తూరిబా గాంధీ మైనార్టీ బాలికా విద్యాలయంలో (2025–26) విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్‌లో ప్రవేశపెట్టిన సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్)లో వివిధ సబ్జెక్టులలో బోధించేందుకు పీజీ, బీఈడీ అర్హత కలిగిన స్థానిక మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి శేషగాని శ్రీనివాస్‌గౌడ్ బుధవారం తెలిపారు. తెలుగు-1, ఇంగ్లిష్-01, ఎకనామిక్స్-01, సివిక్స్-01, కామర్స్-01, నర్సింగ్-01 సబ్జెక్టులను బోధించడానికి తగిన ధృవపత్రాలతో ఈ నెల 7లోగా కేజీబీవీ మైనార్టీ జిల్లా ప్రత్యేకాధికారిణి నారాయణమ్మ 8919180591కు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

నాగారం : మండలంలోని వర్ధమానుకోట గ్రామంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ కావడంతో 2025-26 విద్యా సంవత్సరానికిగాను ఇంటర్ విద్యాబోధన చేయడానికి గెస్ట్ లెక్చరర్ల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి వాసం ప్రభాకర్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ విద్యాసంవత్సరం బైపీసీ, ఎంఎల్‌టీ గ్రూప్‌లు మొదలవుతున్నందున పలు సబ్జెక్టులు బోధించడానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. అర్హులైన వారు తమ దరఖాస్తులను ఈ నెల 5నుంచి 9వతేదీ వరకు గ్రామంలోని కేజీబీవీలో అందించాలని సూచించారు.